

పెరిగిన చోరీలు..
▸ తగ్గిన రేప్, హత్య, పోక్సో నేరాలు
▸ వార్షిక క్రైం సమావేశంలో జోగులాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు 6

తమ ప్రైవేటు పాఠశాలకు ప్రభుత్వ అనుమతి ఉన్నది.. అన్ని వసతులు ఉన్నాయి.. నాణ్యమైన విద్య అందిస్తున్నాం.. అని చేస్తున్న ప్రచారాన్ని నమ్మి అందులో విద్యార్థులను చదివిస్తున్న తల్లిదండ్రులు తీరా మోసపోయామని గుర్తించి ఆందోళన చెందుతున్నారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని పాఠశాలలు పదో తరగతి ఒరిజినల్ మెమోలు ఏడాది గడిచినా ఇవ్వకపోవడం, మరికొన్ని పాఠశాలలు చదివిన స్కూల్‌లో కాకుండా ఇతర పాఠశాలల్లో పరీక్షలు రాయించడం చూస్తే వాటికి ప్రభుత్వం నుంచి అనుమతి లేదని రుజువు చేస్తోంది. అనుమతి లేని పాఠశాలలను మూసి వేయాల్సిన విద్యాశాఖ నిర్లక్ష్యం విద్యార్థులు పాలిట శాపంగా మారుతోంది. మరికొందరు ఒక పాఠశాలకు అనుమతి తీసుకొని, రెండు నుంచి మూడు పాఠశాలలను నిర్వహిస్తుండటం గమనార్హం.

అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై..

చర్యలేవి?





అనుమతి లేకుండా కొనసాగుతున్న మహబూబ్‌నగర్‌లోని డివైన్ గ్రేస్ స్కూల్

- ఉమ్మడి జిల్లాలో 100కుపైగా అనుమతి లేని స్కూల్స్
- మామూళ్లు పుచ్చుకొని పట్టించుకోని విద్యాశాఖ
- నేటికీ ఒరిజినల్ మెమోలు అందక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అనుమతి లేని ప్రైవేటు పాఠశాలల వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యాశాఖ అనుమతి పొందకుండానే.. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఉందని బోర్డులు ఏర్పాటు చేసి, అన్ని వసతులు కల్పిస్తున్నామని కరపత్రాల్లో పెద్ద పెద్ద అక్షరాలతో ముద్రించి, నాణ్యమైన విద్య అందిస్తున్నామని ప్రచారం చేస్తున్నారు. విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకొని వేల రూపాయాల ఫీజులు వసూలు చేస్తున్నారు. తీరా చూస్తే వాటికి అనుమతి లేకపోవడంతో విద్యార్థులు రోడ్డున పడుతున్నారు. ఒరిజినల్ మెమోలు ఇవ్వకపోవడంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా (మిగతా 6లో..)

టీచర్ల సమ్మెతో..

పాఠాలకు బ్రేక్

- సమ్మెలో 470 మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులు
- జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో నిలిచిన బోధన
- ఇంటర్, పదో తరగతి ఫలితాలపై ప్రభావం పడుతుందని విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన



గద్వాల పట్టణంలో సమ్మె చేస్తున్న సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు

ఎర్రవల్లి డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులు డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టారు. దీంతో జిల్లాలోని కేజీబీవీల్లో బోధనకు బ్రేక్ పడటంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. ఇంటర్, పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థినుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. తమ డిమాండ్లు నేరవేర్చేదాక సమ్మె కొనసాగిస్తామని ఉపాధ్యాయులు తేల్చిచెప్పడంతో పరిస్థితి రోజురోజుకు అదుపుతప్పుతోంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

జోగుళాంబ గద్వాల జిల్లాలోని 12 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో 3,614 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా సమగ్రశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)ఉద్యోగులు తమ డిమాండ్లను నేరవేర్చాలని సమ్మెబాట పట్టారు. దీంతో కేజీబీవీల్లో బోధన నిలిచిపోయింది. పరీక్షలు దగ్గర పడుతున్నాయి సిలబస్ పూర్తి కాలేదని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. గద్వాల జిల్లా వ్యాప్తంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు 470 మంది ఉన్నారు. ఇందులో 70శాతానికి పైగా టీచింగ్ స్టాఫ్ ఉన్నట్లు సమాచారం. ఈ సమ్మెతో పాఠశాలలకే బ్రేక్ పడటమే కాకుండా ఎమ్మార్సీ కేంద్రాలు కూడా మూతపడ్డాయి. సమ్మె కారణంగా ఇంటర్, పదో తరగతి ఫలితాలపై తీవ్ర ప్రభావం పడుతుందని విద్యార్థినుల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రేవంత్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి వస్తే రెగ్యులరైజ్ చేస్తామని వరంగల్ వేదికగా ప్రకటించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎడాది గడిచినా తమ సమస్యను పట్టించుకోవడం లేదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థినులకు ప్రత్యామ్నాయంగా బోధన సౌకర్యం కల్పించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.



మూతపడ్డ ఎర్రవల్లి ఎమ్మార్సీ కేంద్రం

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం



సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మెలో ఉండటంతో బోధనకు ఆటంకం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నుంచి అదేశాలు వచ్చాయి. త్వరలోనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి బోధన కొనసాగిస్తాం.

- మహ్మద్ అబ్దుల్ ఘని, డీఈవో

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



వనపర్తి కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం వనపర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ నుంచి కలెక్టర్‌రేట్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్లమెంట్‌లో అమిత్‌షా ఉద్దేశ్యపూర్వకంగానే అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడారన్నారు. ఆయనపై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చీర్ల చందర్, వేముల శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మర్రి జనార్దన్‌రెడ్డికి కేటీఆర్, హరీశ్‌రావు పరామర్శ



మర్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి తదితరులు

నాగర్‌కర్నూల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూలు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిని పలువురు ప్రముఖులు మంగళవారం పరామర్శించారు. ఆయన తండ్రి మర్రి జంగిరెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, బీరం హర్షవర్ధన్‌రెడ్డిలు తిమ్మాజిపేట మండలం నేరెళ్లపల్లికి మంగళవారం మధ్యాహ్నం చేరుకొని జంగిరెడ్డి చిత్ర పటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మర్రి కుటుంబాన్ని ఈ సందర్భంగా పరామర్శించారు.

వేతనాల కోసం ఎదురుచూపు

- నిధులు మంజూరైనా స్కావెంజర్లకు అందని జీతాలు
- హెచ్ఎంలపై పెరుగుతున్న ఒత్తిడి

ఐదు నెలల వేతనాల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్కావెంజర్లు ఎదురుచూస్తున్నారు. నిధులున్నా ప్రభుత్వం రూపొందించిన నిబంధనల వలన వేతనాల చెల్లిపులో జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన నిధులు మంజూరైనా ఇప్పటి వరకు తమకు వేతనాలు అందలేదని స్కావెంజర్లు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని స్కావెంజర్లు కోరుతున్నారు. 6

- గద్వాల టౌన్, ఆంధ్రజ్యోతి



మల్దకల్ జడ్పీహెచ్ఎస్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న స్కావెంజర్

రిజర్వాయర్ మాకొద్దు

- మేము భూములు కోల్పోతాం
- బైకులపై కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లిన రైతులు 6

అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై.. చర్యలేవి?

(మొదటి పేజీ తరువాయి)

మారుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో యాజమాన్యం ఒకటి నుంచి పది వరకు తరగతులను నిర్వహిస్తోంది. అయితే ఇప్పటి వరకు ఆ పాఠశాలకు గుర్తింపు లేకపోవడం గమనార్హం. గత ఏడాది 2023-2024 విద్యా సంవత్సరం ఆ పాఠశాల నుంచి సుమారు 10 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాశారు. అందరూ పాస్ అయ్యారు. కానీ వారికి ఇప్పటి వరకు ఒరిజినల్ మెమోలు ఇవ్వలేదు. వాటి కోసం నిత్యం పాఠశాల చుట్టూ తిరుగుతున్నారు. ఇంటర్‌లో చేరిన తర్వాత కూడా మెమోలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని విద్యా శాఖ

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాలలు కొనసాగుతున్నాయని తెలిసినా విద్యాశాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఏవైనా ఘటనలు జరిగినప్పుడు, విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు పాఠశాలలకు వెళ్లి తనిఖీ చేస్తున్నారు. ఆ తర్వాత వారిచ్చే మామూళ్లు పుచ్చుకొని వాటి వైపు చూడటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతో పాటు వనపర్తి, నాగర్‌కర్నూల్, జడ్చర్ల తదితర పట్టణాలు, నియోజక వర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ఇదే తంతు కొనసాగుతోంది. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అనుమతి లేకుండా పాఠశాలను ప్రారంభిస్తే చర్యలు తీసుకుని, వెంటనే మూయించాలి. కానీ పట్టించుకోకపోవడంతో అందులో చదివిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాం: యాజమాన్యం

మా పాఠశాలకు గుర్తింపు కోసం గత నెలలో దరఖాస్తు చేసుకున్నాం. ఇంకా అనుమతి రాలేదు. త్వరలోనే వస్తుంది. పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నాం. ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు అనుమతికి కోసం దరఖాస్తు చేసుకున్నాం. గత ఏడాది మా పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాసిన మాట వాస్తవమే.



డీఈవో కార్యాలయం

ఆ పాఠశాలకు అనుమతి లేదు

జిల్లా కేంద్రంలోని డివైన్ గ్రేస్ పాఠశాలకు అనుమతి లేదు. పాఠశాలకు వెళ్లి తనిఖీ చేశాం. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లాం. రిపోర్టు కూడా ఇచ్చాం. గుర్తింపు లేకుండా పాఠశాలలు నడిపితే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. ఒక పాఠశాలకు అనుమతి తీసుకొని, నిబంధనలకు విరుద్ధంగా రెండు నుంచి మూడు బ్రాంచీలు నడిపితే పాఠశాల గుర్తింపును రద్దు చేస్తాం.

\- లక్ష్మణ్‌సింగ్, మహబూబ్‌నగర్ అర్బన్ మండల ఎంఈవో

● మరో పాఠశాలకు కూడా గుర్తింపు లేకపోవడంతో అందులో చదివిన పదో తరతి విద్యార్థులను మరో పాఠశాలలో చదినట్లు పరీక్షలు రాయించారు. దాంతో ఒరిజినల్ మెమోల్లో చదివిన పాఠశాల పేరు కాకుండా పరీక్ష రాసిన పాఠశాల పేరు వచ్చింది. అది చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించగా, తమ పాఠశాలకు పదో తరగతికి అనుమతి లేనందున వేరే పాఠశాల నుంచి పరీక్ష రాయించామని చెప్పారని వారు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

● మహ్మదాబాద్ మండల కేంద్రంలో రెండేళ్ల కిందట ఓ పాఠశాలను ఏర్పాటు చేశారు ఆ పాఠశాలకు ఇప్పటి వరకు అనుమతి లేదు. దాంతో విద్యార్థులకు టీసీ, బోనఫైడ్‌లు ఇతర పాఠశాల నుంచి ఇస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఉమ్మడి జిల్లాలో అనుమతిలేని ప్రైవేట్ పాఠశాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలు అయితే వందకుపైగా ఉండటం గమనార్హం.

ఒకదానికి అనుమతి తీసుకొని మూడు పాఠశాలల నిర్వహణ

మరికొందరు ఒక పాఠశాలకు అనుమతి తీసుకొని, రెండు నుంచి మూడు బ్రాంచులు కొనసాగిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డివైన్ గ్రేస్ స్కూల్‌కు అనుమతి లేకున్నా కొనసాగిస్తున్నారన్న ఫిర్యాదుతో విచారణ చేయాలని డీఈవో మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈవోను ఆదేశించారు. పాఠశాలకు వెళ్లినా, ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతో యథావిధిగా కొనసాగుతోంది.

జడ్చర్ల కోర్టులో ఈ సేవా కేంద్రం ప్రారంభం



ఈ సేవా కేంద్రం ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయాధికారి కల్యాణ్‌చక్రవర్తి

జడ్చర్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల కోర్టులో ఈ సేవా కేంద్రాన్ని మంగళవారం జిల్లా అదనపు న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సేవా కేంద్రం ద్వారా కేసుల విషయాలను కక్షిదారులు సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే కేసుల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 కేంద్రాల్లో వర్చువల్ ద్వారా హైకోర్టు ఆధ్వర్యంలో ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. జడ్చర్ల కోర్టు న్యాయమూర్తి ముద్దాసిర్, జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ ఈ సేవా కేంద్రంతో న్యాయవాదులు, కక్షిదారులకు కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. న్యాయవాదులు మాలిక్ షాకీర్, మహేశ్వర్‌రెడ్డి, మోహన్‌రావు, ఇఫ్తెకార్, శ్రీనివాస్ గౌడ్, విశ్వేశ్వర్, పురుషోత్తంరావు, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, రూరల్ సీఐ నాగార్జునగౌడ్, కోర్టు సిబ్బంది మహేష్, కైకేయి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి సమగ్ర శిక్షా ఉద్యోగుల వినతి



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న సమగ్రశిక్షా అభియాన్ జేఏసీ నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు రోజుకో రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ నుంచి బస్‌స్టాండ్ సమీపంలో గల ధర్నా చౌక్ వరకు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహనికి జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి యాదగిరి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను విద్యాశాఖలో విలీనం చేయాలని 15 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నా ముఖ్యమంత్రి స్పందించడం లేదన్నారు. గత ఎన్నికల ముందు హన్మకొండలో ఇచ్చిన హామీ మేరకు తమను విద్యాశాఖలో విలీనం చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంతకుముందు నవాబ్‌పేట, మహమ్మదాబాద్ మండల విద్యాశాఖ అధికారులు నాగ్యానాయక్, రాజునాయక్, గండీడ్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బోరు కృష్ణయ్య, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అశ్విని చంద్రశేఖర్, టీపీటీఎఫ్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ, జిల్లా అధ్యక్షుడు మహమూద్ మద్దతు తెలిపారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అంజేసినట్లు జిల్లా అధ్యక్షుడు మహమూద్ తెలిపారు.

వినియోగదారులు మోసపోవద్దు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు మోసపోవద్దని పీయూ ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ నాగసుధ అన్నారు. మంగళవారం పీయూలోని అకాడమిక్ భవనంలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, వినియోగదారుల హక్కులు, వ్యక్తిగత పరిరక్షణ గురించి వివరించారు. మోసాలు జరిగినప్పుడు కేసు ఎలా వేయాలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎన్ అర్జున్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. తెలుగు విభాగ విద్యార్థులకు శ్రీనాథ కావ్యనామ కోశము పుస్తకాలను ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్నెమోని కృష్ణయ్య పంపిణీ చేశారు.

అంబేడ్కర్‌ను కించపరచడం దుర్మార్గం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలు సైతం అంబేడ్కర్‌ను, ఆయన రచించిన రాజ్యాంగాన్ని అభినందిస్తుంటే కేంద్ర మంత్రి అమిత్‌షా ఆయన్ను కించపరచడం దుర్మార్గమని, మంత్రివర్గం నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. దేశ ప్రజలంతా ఎంతగానో అభిమానించే నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్ షా కించపరిచేలా వ్యంగ్యంగా మాట్లాడటం బాధాకరం అన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే బీసీ, ఎస్సీ, ఎస్టీ, అగ్రవర్ణ పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సామాన్యమైన వ్యక్తి ఈరోజు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడంటే అది రాజ్యాంగం రాసిన అంబేడ్కర్ ద్వారానే అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బహిష్కరించాలన్నారు. అల్లుఅర్జున్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి పేద మహిళ కుటుంబానికి అండగా నిలిచారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏ.రవికుమార్, చంద్రకాంత్‌గౌడ్, గోలపల్లి నారాయణ, కోళ్ల వెంకటేష్, కున్సి నాగేందర్ పాల్గొన్నారు.



సాధిక్‌అలీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జితేందర్‌రెడ్డి

సాధిక్ అలీ కుటుంబాన్ని పరామర్శించిన జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ అథ్లెట్, సాఫ్ట్‌బాల్ కోచ్ సాధిక్ అలీ మృతి చెందగా, మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, రాష్ట్ర ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఏపీ జితేందర్‌రెడ్డి సాధిక్‌అలీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తరుపున ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. డీవైఎస్‌వో శ్రీనివాస్, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, బాల్‌రాజ్, నెట్‌బాల్ అసోసియేషన్ సభ్యుడు సోహెల్, ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర నాయకుడు అశ్వథామరెడ్డి పాల్గొన్నారు.

వేతనాల కోసం ఎదురుచూపు

గద్వాల టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య, వివిధ పనులు నిర్వహిస్తున్న స్కావెంజర్లకు ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా జిల్లాలో 800 మందికి పైగా స్కావెంజర్లు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరైనా అధికారులు విఫలమవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన నిబంధనల్లో తిరకాసు ఉండటం వల్లే జాప్యం జరుగుతోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

గద్వాల జిల్లాలోని 450 పాఠశాలల్లో స్కావెంజర్లు

ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుధ్య పనులు, తాగునీటి నిర్వహణ, మొక్కలకు నీరు పోయడం వంటి పనుల కోసం విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం స్కావెంజర్ల నియామకం చేపట్టింది. 1-30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో స్కావెంజర్‌కు నెలకు రూ.3వేలు, 31-100 మంది విద్యార్థులు ఉంటే రూ.6 వేలు, 101-250 మంది ఉంటే రూ.8 వేలు, 251 నుంచి 500 మంది ఉంటే రూ.12వేలు, 501 నుంచి 750 మంది ఉంటే రూ.15 వేలు, 750 మంది విద్యార్థులకు పైగా ఉన్న పాఠశాలల్లో స్కావెంజర్లకు రూ.20వేలు చెల్లించాలని నిబంధన రూపొందించారు. ఈ క్రమంలో జిల్లాలోని 460 ప్రభుత్వ పాఠశాలలకు గాను పది పాఠశాలను జీరో ఎన్‌రోల్‌మెంట్ కారణంగా పక్కనపెట్టిన అధికారులు, మిగతా 450 పాఠశాలల్లో స్కావెంజర్లకు అవకాశం కల్పించారు. వీరికి నిబంధనల ప్రకారం ప్రతీ మూడు నెలలకు ఒకసారి వేతనాలు చెల్లించాల్సి ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రారంభించిన ఈ విధానం ఆధారంగా ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన నిధులు రూ.95 లక్షలకు పైగా ప్రభుత్వం నుంచి మంజూరైనా ఇప్పటి వరకు స్కావెంజర్ల చేతికి అందకపోవడం సమస్యగా మారింది.

నిబంధనలతో తిరకాసు

విద్యార్థుల సంఖ్య ఆధారంగా సంబంధిత పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పేరున నిధులు జమచేయాలి. అదే కమిటీలో సభ్యులుగా ఉండే గ్రామ మహిళా సంఘం సభ్యురాలు ఉండే డ్వాక్రా మహిళా సంఘం పేరుతో స్కావెంజర్ వేతనం అందజేయాల్సి ఉండటంతో నిబంధనల పాటింపులో జాప్యం జరుగుతున్నట్లు స్కావెంజర్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి వేతనాలు అందించాలని కోరుతున్నారు.

వేతనాలు ప్రతీ నెల చెల్లించాలి



కమిటీలు, నిబంధనల పేరుతో కాలయాపన చేయకుండా పనిచేస్తున్న స్కావెంజర్ బ్యాంకు ఖాతాలో ప్రతీనెల నగదు జమ చేసేలా అధికారులు తగిన విధానం రూపొందించాలి. వెంటనే వేతనాలు చెల్లింకపోతే ప్రత్యక్ష ఆందోళన చేసేందుకు మా యూనియన్ సిద్ధంగా ఉంది.

\- ఉప్పేరు నరసింహ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

త్వరలోనే వేతనాలు ఇస్తాం



ప్రస్తుత విద్యా సంవత్సరంలో పనిచేస్తున్న స్కావెంజర్ల తొలి త్రైమాసిక వేతనాలు ఇప్పటికే విడుదల అయ్యాయి. సంబంధిత ఫైళ్లను జిల్లా ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. రెండు, మూడురోజుల్లో వేతనాలు అందజేస్తాము. ఈ విషయంలో స్కావెంజర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు.

\- అబ్దుల్ ఘని, జిల్లా విద్యాశాఖ అధికారి

పేపర్‌లెస్ కోర్టుగా అభివృద్ధి

- ఈ-కోర్టు సేవా కేంద్రం ప్రారంభం

- జిల్లా న్యాయాధికారి డీ రాజేష్‌బాబు



కల్వకుర్తిలో ఈ-కోర్టు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి రాజేష్‌బాబు

కల్వకుర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతను ఉపయోగించుకుని కల్వకుర్తికోర్టును పేపర్ లెస్ కోర్టుగా అభివృద్ధి చేస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయాధికారి డీ రాజేష్‌బాబు తెలిపారు. జిల్లాలో ఈ-కోర్టు సేవా కేంద్రాలను హైకోర్టు అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని కోర్టు ఆవరణలో మంగళవారం ఈ-కోర్టు సేవా కేంద్రాన్ని సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి, జూనియర్ సివిల్ న్యాయాధికారి కావ్యలతో కలిసి జిల్లా న్యాయాధికారి డీ రాజేష్‌బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయశాఖలో సాంకేతికతను మరింత ముందుకు తీసుకుపోవడానికి హైకోర్టు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ-కోర్టు సేవా కేంద్రంలో ఫైల్ చేస్తే జిల్లాలోని ఏ కోర్టుకైనా ఆ ఫైల్ వెళ్తుందని తెలిపారు. టెక్నాలజీని ప్రతీ ఒక్కరు ఉపయోగించుకోవాలని సూచించారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, కల్వకుర్తి, సీఐ నాగార్జున, కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి, వంగూరు ఎస్ఐ మహేందర్, వెల్దండ ఎస్ఐ తదితరులు ఉన్నారు.

పెరిగిన చోరీలు..



సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గడిచిన సంవత్సరంలో జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా పోలీస్ వ్యవస్థ పటిష్టంగా ఉందని నిరూపించామని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వార్షిక క్రైం సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో భాగంగా ఈ ఏడాది 2,419 కేసులు నమోదు చేశామని, గ్రేవ్ కేసులే గతేడాది 94 నమోదు కాగా ఈ ఏడాది 69 నమోదైనట్లు తెలిపారు. జిల్లాలో గ్రేవ్‌కేసులు ప్రామాణికంగా నిలుస్తాయని, హత్యలు గతేడాది 12 కాగా ఈ ఏడాది తొమ్మిది అయ్యాయని తెలిపారు. గతేడాది రేప్, పోక్సో కేసులు 201 కాగా ఈ ఏడాది 186కు చేరిందన్నారు. చీటింగ్ కేసులు మాత్రం గతేడాది 100 ఉండగా ఈ ఏడాది 169, దొంగతనాలు గతేడాది 61 కాగా ఈ ఏడాది 89, సాధారణ దొంగతనాలు గతేడాది 82 కాగా ఈ ఏడాది 126కు చేరాయి. ఎస్సీ, ఎస్టీ కేసులు గతంలో 25 కాగా, ఈ సంవత్సరంలో 40 నమోదైనట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతేడాది 90 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 133 కేసులు నమోదు చేసి 205 వాహనాలను సీజ్ చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గతంలో 102 కేసులు కాగా ఈ ఏడాది 112 నమోదు చేశామన్నారు. జూలై నుంచి కొత్త చట్టాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రాపర్టీ కేసులకు సంబంధించి ముఖ్యమైన కేసులను ఛేదించామని తెలిపారు. గద్వాలలో ఎస్‌వీ ఈవెంట్ హాలు, లింగంబాగ్ కాలనీలో జరిగిన దొంగతనాలకు సంబంధించి 30 తులాల బంగారం, రూ. 4.80 లక్షలను రికవరీ చేశామన్నారు. కలెక్టరేట్ ఎదురుగా కారు అద్దాలను పగులగొట్టిన బిత్రాగుంట గ్యాంగ్‌కు చెందిన వ్యక్తి నుంచి రూ. 3.10 లక్షలు రికవరీ చేశామన్నారు. బైక్ దొంగతనాలకు సంబంధించి 35 బైక్‌లను రికవరీ చేసి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. గేమింగ్ యాక్ట్‌లో 35 కేసుల్లో 263 మందిపై కేసు నమోదు చేసి రూ. 10,91,754 స్వాధీనం చేసుకున్నామన్నారు. పీడీఎస్ అక్రమ రవాణాపై 53 కేసులలో 87 మందిపై కేసులు నమోదు చేసి 950.74 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 3,206 కేసులు నమోదు కాగా రూ. 32,06,000 జరిమానా విధించామని, ఈ కేసులో 67 మందికి జైలు శిక్ష పడిందని తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించి మొత్తం 512 ఫిర్యాదులు రాగా అందులో రూ. 3,83,50,299 నగదు కోల్పోయిందన్నారు. ఇందుకు సంబంధించి 50 కేసులను నమోదు చేసి రూ. 55,29,181 నగదును ఫ్రీజ్ చేసి రూ. 10,59,051 నగదును బాధితులకు అప్పగించామన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఈ ఏడాది 416 ఫిర్యాదులు రాగా 335 ఫిర్యాదులను పరిష్కరించామని, 81 ఫిర్యాదులు ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా 594 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, అందులో ఈ ఏడాది 118 కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఏది ఏమైనా గత ఏడాది కంటే ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గేలా చూశామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ, గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, అలంపూర్ సీఐ రవి తదితరులు ఉన్నారు.

రిజర్వాయర్ మాకొద్దు

- ఉమామహేశ్వర రిజర్వాయర్ వద్దని కలెక్టర్‌కు వినతి

బల్మూరు/ తాడూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉమామహేశ్వర రిజర్వాయర్ మాకు వద్దంటూ బాధిత రైతులు కలెక్టర్ వద్ద మొరపెట్టుకునేందుకు బైక్‌లపై జిల్లా కేంద్రానికి బయలుదేరి వెళ్లారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం దశల వారీగా ఇరిగేషన్ శాఖ అధికారులు, సర్వేయర్లు తమ వ్యవసాయ పొలాల్లో జెండాలు నాటుతుండడంతో ఆగ్రహించిన రైతులు, అధికారులను అడ్డగించారు. న్యాయమైన పోరాటం చేయాలని జిల్లా కలెక్టర్ ను కలుసుకుని తమ గోడును వినిపించాలని మండల కేంద్రం బల్మూరు, అనంత వరం గ్రామాల రైతులు ద్విచక్ర వాహనాలపై జిల్లా కేంద్రానికి వెళ్లారు. అదేవిధంగా అనంతవరం గ్రామాల రైతులు ద్విచక్ర వాహనంపై జిల్లా కేంద్రానికి వెళ్లారు. అదేవిధంగా అనంతవరం గ్రామ శివారులో ఇరిగేషన్ శాఖ అధికారులు కాల్వ హద్దులను ఏర్పాటు చేసుకోవడానికి రావడంతో రైతులు పెద్ద ఎత్తున అడ్డగించి అక్కడ నుంచి వారిని పంపించారు. అధికా రులు మాత్రం ఎమ్మెల్యే వంశీకృష్ణతో మధ్యాహ్నం సమావేశం ఉంటుందని, ఆ సమావేశానికి రైతులు రావాలని రైతులకు సూచించారు. కొందరు రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లగా మరికొంత మంది రైతులు ఎమ్మెల్యేను కలవడానికి వెళ్లారు. ఏదేమైనా కాల్వలు కానీ రిజర్వాయర్ నిర్మాణం చేపడితే పెద్దసంఖ్యలో భూములు కోల్పోయి పేదవారుగా మారుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉసురు తీసుకోవద్దని మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను అర్థం చేసుకోవాలని ప్రజాప్రతి నిధులు, అధికారులను వారు కోరారు.

జాతీయ రహదారికి భూమి ఇవ్వం

- తాడూరులో నిర్వాసితుల గోడు

మండల కేంద్రమైన తాడూరులో నూతనంగా నిర్మిస్తున్న కల్వకుర్తి- నంద్యాల జాతీయ రహదారికి సంబంధించి తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని భూనిర్వాసితులు ఆందోళన చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జాతీ య రహదారికి సంబంధించి బైపాస్ రోడ్డు నిర్మించే ప్రాంతానికి సంబంధించి తమ భూములు ఇవ్వబోమంటూ భూని ర్వాసితులు అధికారులకు తెగేసి చెబుతు న్నారు. మరీ ఇబ్బందులకు గురి చేసినట్లయితే ఆత్మహత్య చేసుకోవడానికి సైతం వెనకాడబోమంటూ పెట్రోల్ డబ్బాలు చేతిలో పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సర్వేయర్ శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ సల్మాన్‌లు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్ప టికీ వారు ససేమిరా అన్నారు. గతంలో రహదారి బైపాస్‌కు సంబంధించి మూడు సర్వేలు చేయగా పేద రైతుల పొలాల్లో నుంచే అలైన్‌మెంట్‌ను ఫైనల్ చేయడం ఎంత వరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భూముల్లోనే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతే జీవనోపాధి లేకుండా రోడ్డున పడాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భూనిర్వా సిత రైతులు చింత సత్తి, కాశన్న, కురుమూర్తి, శేఖర్, అంజనేయులుతో పాటు మరికొంత మంది రైతులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి ఇవ్వడానికి బల్మూరు నుంచి బైక్‌లపై జిల్లా కేంద్రానికి వెళ్తున్న రైతులు

బీచుపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను

సస్పెండ్ చేయాలి

- 20 కిలో మీటర్ల పాదయాత్రతో కలెక్టరేట్‌కు వచ్చి విద్యార్థుల ధర్నా



బీచుపల్లిలోని గురుకుల పాఠశాల నుంచి గద్వాల కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న విద్యార్థులు

గద్వాల క్రైం/ఎర్రవల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు.. సస్పెండ్ చేయాలని నినాదాలు చేస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లి గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్, పదో తరగతి విద్యార్థులు మంగళవారం 20 కిలోమీటర్లు కాలినడకన ర్యాలీగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు చేరుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఇటిక్యాల మండలం బీచుపల్లిలోని రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తమ పట్ల శాడిజాన్ని ప్రదర్శిస్తున్నారని వాపోయారు. ఆయన ఇప్పటికే రెండు సార్లు సస్పెండ్ అయ్యారని, అయినా ప్రవర్తనలో మార్పు రాలేదని ఆరోపించారు. ఏ చిన్న తప్పు దొరికినా దాడిచేసి గాయపర్చుతారన్నారు. కొందరు విద్యార్థుల తప్పులను వెతికి కొట్టడంతో పాటు టీసీలు ఇచ్చి పంపుతున్నారని అన్నారు. ఉన్నవారికి టీసీలు ఇచ్చి డబ్బులు తీసుకొని ఇతర విద్యార్థులను చేర్చుకుంటున్నారన్నారు. తమ సమస్యలపై పలు మార్లు అధికారులకు తెలిపినా ఫలితం లేదన్నారు. కలెక్టర్ తమ పాఠశాలలో బస చేసినప్పుడు చెబుదామనుకుంటే ఈ విషయాలను బయటికి చెబితే మీకు టీసీలు ఇస్తానని భయపెట్టారన్నారు. పాచిపోయిన ఆహారాన్ని వడ్డిస్తున్నారని, కలెక్టర్ స్పందించి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించినా విద్యార్థులు తమ ర్యాలీని ఆపకుండా కలెక్టరేట్‌కు చేరారు. కలెక్టర్ బీఎం సంతోష్ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. 'ఆంధ్రజ్యోతి' ప్రిన్సి పాల్‌ను వివరణ కోరగా విద్యార్థులను క్రమశిక్షణగా ఉంచేందుకు ప్రయత్నించడంతో ఆందోళనకు దిగారని చెప్పారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి

బిజినేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మంగనూరులో చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండలంలోని మంగనూర్ గ్రామంలో బాలనాగయ్యకు చెందిన ట్రాక్టర్‌ను బాలమశయ్య అనే రైతు పొలం దున్నేందుకు కిరాయికి పంపాడు. ఆదే గ్రామానికి చెందిన డ్రైవర్ శివ పొలం దున్నుతుండగా పొలం యజమాని బంధువు మహేష్ (18) ట్రాక్టర్ పై కూర్చున్నాడు. ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్ కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. మహేష్‌పై ఇంజన్ పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

సోర్ట్స్ బాక్స్

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

» బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతునాయుడు

» బోయలగూడెంలో గిరక బండ్ల పోటీలు ప్రారంభం



గిరక బండ్ల పోటీలను ప్రారంభిస్తున్న బాసు హన్మంతునాయుడు

గట్టు (గద్వాల), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు నాయుడు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధి లోని బోయలగూడెం గ్రామంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం నిర్వహించిన ఎద్దుల బండ్ల గిరక, కబడ్డీ పోటీలను జడ్పీటీసీ మాజీ సభ్యు రాలు బాసు శ్యామలతో కలిసి ఆయన ప్రారంభించారు. అంతకు ముందు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నూర్‌పాషా, ఎస్.రాము, మోనేశ్, రాజునాయుడు, తిరుమలేశ్, బాసుగోపాల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కున్సి విద్యార్థులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన తనూజ, సన, మేఘన, నందిని

కృష్ణ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని కున్సి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 19న నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో టోర్నమెంట్‌లో పాఠశాల విద్యార్థినులు తనూజ, మేఘన, నందిని, సన ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 27న వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న క్రీడా పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వారిని అభినందించారు. కార్యక్రమంలో సంతోషి, ఉష, సౌమ్య, నరేందర్, నర్సింహులు, రమేశ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారుడు బసంత్‌తో కోచ్ జగదీశ్

మక్తల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ పట్టణానికి చెందిన బసంత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 22న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో అతడు ప్రతిభ కనబరిచాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వచ్చే నెలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా బసంత్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య అభినందంచారు.

బాస్కెట్‌బాల్ సిస్టర్స్



» రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు జ్యోతి, ప్రియాంక - సాయినిఖిత, హరిణి

» కోచ్ మహ్మద్ ఖలీల్ వద్ద శిక్షణ » క్రీడా కోటాలో ఉన్నత విద్యాసంస్థల్లో సీటు



మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పేద కుటుంబం.. తప్పని ఆర్థిక ఇబ్బందులు.. అయినా వారు వెనుకడుగు వేయలేదు. అన్ని సమస్యలను అధిగమించి క్రీడారంగంలో రాణిస్తున్నారు. వారే మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన అక్కా చెల్లెళ్లు జ్యోతి, ప్రియాంక - సాయి నిఖిత, హరిణి. వ్యాయామ ఉపాధ్యాయుడు విలియం, కోచ్ ఖలీల్ ఆధ్వర్యంలో బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ పొందిన వీరు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతూ బాస్కెట్‌బాల్ సిస్టర్స్‌గా పేరు తెచ్చుకున్నారు.

నిరుపేద కుటుంబం నుంచి..

మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలం, కేశ్వాపూర్ పెద్దతండాకు చెందిన రమేశ్, హేమ దంపతులు 20 ఏళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వచ్చి ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. జామపండ్ల వ్యాపారం చేస్తూ జీవనం గడుపుతున్నారు. అలా వచ్చిన డబ్బుతోనే పిల్లలను చదివించు కుంటున్నారు. ముగ్గురు కుమార్తెలు కె.జ్యోతి, కె.ప్రియాంక, సుప్రియ పట్టణంలోని మోడ్రన్ హైస్కూల్‌లో చదువుకున్నారు. అప్పుడే జ్యోతి, ప్రియాంక వ్యాయామ ఉపాధ్యాయుడు విలియం ప్రోత్సాహంతో బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ పొందారు. పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, క్రీడా కోటాలో ఇంజనీరింగ్ సీట్లు సాధించారు. జ్యోతి తమిళనాడులోని ఎస్ఆర్ఎం విలియమ్ కళాశాలలో, ప్రియాంక హిందుస్తాన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కేఎల్ యూనివర్సిటీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నారు. మహబూబ్‌నగర్‌లోనే ఉంటూ స్టేడియం మైదానంలో డీఎస్ఏ కోచ్ ఖలీల్ పర్యవేక్షణలో బాస్కెట్‌బాల్ శిక్షణ పొందుతున్నారు. కేరళ కొట్టెం యూనివర్సిటీలో ఈ ఏడాది డిసెంబర్ 20న ప్రారంభమైన నేషనల్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొంటున్నారు.

అమ్మ చూపిన బాటలో..

జనగాం జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్, ప్రేమలత దంపతులు 16 ఏళ్ల క్రితం ఉపాధి కోసం మహబూబ్‌నగర్ పట్టణానికి వచ్చి, హౌసింగ్ బోర్డు కాలనీలో నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు సాయి నిఖిత, హరిణి ఉన్నారు. శ్రీనివాస్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేస్తున్నారు. ప్రేమలత పాఠశాల స్థాయిలో కబడ్డీ క్రీడాకారిణి. అప్పట్లో జిల్లా స్థాయి టోర్నమెంట్లలో పాల్గొన్నది. ఆమె స్ఫూర్తితో ఇద్దరు కుమార్తెలూ క్రీడలపై ఆసక్తి పెంచుకున్నారు. బాస్కెట్ బాల్ క్రీడలో రాణిస్తున్నారు. మోడ్రన్ స్కూల్‌లో చదువుకుంటున్న వీరు వ్యాయామ ఉపాధ్యాయుడు విలియం సహకారంతో, డీఎస్ఏ కోచ్ పర్యవేక్షణలో బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ పొందుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు.

14 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్న..



మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియం మైదానంలో 14 సంవత్సరాలుగా క్రీడాకారులకు బాస్కెట్‌బాల్ శిక్షణ ఇస్తున్నాను. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇస్తున్నాం. మా వద్ద శిక్షణ పొందిన దాదాపు వంద మంది బాల బాలికలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలను సొంతం చేసుకున్నారు. జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగి జిల్లా, రాష్ట్రం, దేశానికి పేరు తేవాలి.

- మహ్మద్ ఖలీల్, బాస్కెట్‌బాల్ కోచ్

అంతర్జాతీయ స్థాయికి చేరాలి : జ్యోతి

అంతర్జాతీయ స్థాయికి చేరడమే లక్ష్యమని, క్రీడా కోటాలో రైల్వే శాఖలో ఉద్యోగం సాధించడమే ధ్యేయమని జ్యోతి అంటోంది. ఆమె పంజాబ్‌లో 2015లో నిర్వహించిన నేషనల్ బాస్కెట్‌బాల్ జూనియర్స్ టోర్నీలో రాష్ట్ర జట్టు తరపున పాల్గొన్నది. ఆదే ఏడాది వరంగల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్‌జీకేఏ టోర్నీలోనూ ప్రతిభ కనబరిచింది. 2016లో కర్ణాటక జరిగిన యూత్, ఉత్తర ప్రదేశ్‌లో నిర్వహించిన జూనియర్ నేషనల్ టోర్నీలో పాల్గొని రాణించింది. ఆదే ఏడాది హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించింది. 2018లో పంజాబ్‌రాష్ట్రంలోని లుథియానా, 2019లో ఢిల్లీలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19, పంజాబ్ రాష్ట్రం లుథియానాలో నిర్వహించిన సీనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొన్నది. 2021లో కేరళ అన్నా యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొన్నది. గుజరాత్‌లో 2022లో నిర్వహించిన 36వ నేషనల్ గేమ్స్‌లో పాల్గొని స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నది. ఆదే ఏడాది చైన్నెలో జరిగిన 71వ సీనియర్ నేషనల్ టోర్నీలో రజత పతకం దక్కించుకున్నది. ఇప్పటి వరకు 26 సార్లు రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో జిల్లాకు ప్రాతినిథ్యం వహించింది.

రైల్వేలో ఉద్యోగం సాధిస్తా : ప్రియాంక

క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తానని బాస్కెట్ బాల్ క్రీడాకారిణి ప్రియాంక అంటోంది. ఆమె ఇప్పటి వరకు 22 రాష్ట్రస్థాయి టోర్నీల్లో పాల్గొని సత్తా చాటుకున్నది. అలాగే 2017లో ఢిల్లీలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించింది. 2018లో ఖేలో ఇండియా నేషనల్ గేమ్స్ అండర్ - 17 విభాగానికి ఎంపికయ్యింది. 2019లో ఢిల్లీలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ టోర్నీలో అక్క జ్యోతితో కలిసి రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించింది. తమిళనాడు హిందుస్తాన్ యూనివర్సిటీలో 2022లో జరిగిన సౌత్‌జోన్ నేషనల్, 2023లో ఆలిండియా నేషనల్ టోర్నీల్లో పాల్గొన్నది.



అక్కా చెల్లెళ్లు జ్యోతి, ప్రియాంక

దేశ సేవ చేయడమే లక్ష్యం : సాయి నిఖిత

బాస్కెట్ బాల్ క్రీడలో రాణించి, క్రీడా కోటాలో ఆర్మీలో చేరి దేశసేవ చేయడమే తన లక్ష్యమని సాయి నిఖిత తెలిపింది. ప్రస్తుతం మహబూబ్‌నగర్ పట్టణంలోని మాడ్రన్ స్కూల్‌లో చదువుతున్న ఆమె ఇప్పటి వరకు 10 సార్లు రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొని ప్రతిభ చాటుకున్నది. 2023లో పాండిచ్చేరిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో రాణించి, రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యింది.

ఇటీవల మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లోనూ పాల్గొని ప్రశంసలు అందుకున్నది.



అక్కా చెల్లెళ్లు సాయినిఖిత, హరిణి,

డాక్టర్ కావడమే ధ్యేయం : హరిణి

క్రీడారంగంలో రాణిస్తూనే చక్కగా చదువుకొని డాక్టర్ కావడం తన ధ్యేయమని హరిణి తెలిపింది. మహబూబ్‌నగర్ పట్టణంలోని మాడ్రన్ హై స్కూల్‌లో చెల్లి సాయి నిఖితతో పాటు 10వ తరగతి చదువుకుంటోంది. ఇప్పటివరకు ఏడు సార్లు జిల్లా స్థాయి టోర్నీలో పాల్గొన్నది. మూడు సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటింది. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని క్రీడాభిమానుల ప్రశంసలు అందుకున్నది.

క్రైం కార్నర్

ఎద్దుల బండిపై నుంచి పడి చిన్నారి మృతి



పల్లవి (ఫైల్)

తాడూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎద్దుల బండిపై నుంచి పడి ఓ చిన్నారి మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో ఈ విషాద సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన బాలస్వామి, చెన్నమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. మంగళ వారం మధ్యాహ్నం పొలానికి వెళ్లేందుకు బాలస్వామి ఎద్దుల బండిని సిద్ధం చేసి, పెద్ద కుమార్తె ఝాన్సీకి ఇచ్చి, తాను ద్విచక్ర వాహనంపై ముందు వెళ్తున్నాడు. అదే సమ యంలో చిన్న కుమార్తె పల్లవి (5) ఊరు దాటేంత వరకు తానూ వస్తానంటూ బండి ఎక్కింది. కొద్ది దూరం వెళ్లగానే బాలిక ప్రమాదవ శాత్తు బండిపై నుంచి కింద పడిపోయింది. ఆమె మీది నుంచి బండి చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఝాన్సీ పెద్దగా కేకలు వేయడంతో తండ్రి వెనుదిరిగి అక్కడికి చేరుకున్నారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తూ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

అదృశ్యమైన బాలుడి మృతి

» చెరువులో మృతదేహం లభ్యం



నవీన్‌కుమార్ (ఫైల్)

హన్వాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన ఓ బాలుడు చెరువులో శవమై కనిపించాడు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ గ్రామానికి చెందిన బైకని నవీన్‌కుమార్ (17) ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం అతడి మృతదేహం చెరువులో కనిపించడంతో స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, నవీన్‌కుమార్‌దిగా గుర్తించారు. అతడు హన్వాడ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. కాగా బాలుడి శరీరంపై గాయాలు ఉండటంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు.

కుంటలో పడి వృద్ధుడి మృతి

కల్వకుర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కోర్టు పనిమీద వెళ్లిన ఓ వృద్ధుడు, కుంటలో పడి మృతి చెందాడు. కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన రంగయ్య (65) ఈ నెల 20న కోర్టు పని మీద కల్వకుర్తికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుమారుడు పుల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో మంగళవారం కల్వకుర్తి పట్టణ సమీరంలో, దేవరకొండ రోడ్డులోని కుంటలో వృద్ధుడి మృతదేహం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించగా, మృతుడు రంగయ్య అని గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బైక్ పైనుంచి పడి మహిళకు తీవ్ర గాయలు

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూరు చౌరస్తా నుంచి శాంతినగర్‌కు వెళ్లే మార్గంలో మంగళవారం ద్విచక్ర వాహనంపై నుంచి ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మానవపాడు మండలం, చెన్నిపాడు గ్రామానికి చెందిన సుశీలమ్మ, అల్లుడు సాయి కుమార్, ఇద్దరు మనుమరాళ్లతో కలిసి ద్విచక్ర వాహంపై కంచుపాడులోని జమ్ములమ్మ ఆలయానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం గ్రామానికి తిరిగి వస్తుండగా పోతులపాడు స్టేజీ సమీపంలో సుశీలమ్మ కళ్లు తిరిగి బైక్‌పై నుంచి కింద పడింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో ఆమె మీద నుంచి వెళ్లడంతో కుడి కాలు విరిగిపోయింది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆమెను కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ప్రజా సంఘాల నాయకులు

» ప్రజా సంఘాల డిమాండ్

పాలమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావుకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ డిసెంబరు 12న పార్లమెంటులో హోం మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. తమ కోసం జీవితాంతం కష్టపడిన అంబేడ్కర్‌ను ఎన్ని సార్లయినా స్మరించుకుంటారని, దానితో హోం మంత్రికి కలిగిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే ప్రజలు పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. అంబేడ్కర్‌పై ప్రజలకు అమితమైన గౌరవం ఉందని, ఆయనను ఏకవచనంతో సంబోధించడాన్ని ఏ మాత్రమూ సహించలేరని చెప్పారు. అంబేడ్కర్ లౌకికవాది అని, అలాంటి వ్యక్తిని అలౌకిక విషయాలతో జోడించి మాట్లాడటం రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న హోంమంత్రికి ఎంత మాత్రమూ తగదన్నారు. ఆయనను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హన్మంతు, ఎం. రాఘవాచారి, కె.కృష్ణయ్య మాదిగ, ఏ రామచంద్రయ్య, కె.శాంతికుమార్, పెంటయ్య, డి.వెంకట నర్సయ్య యాదవ్, ఎస్.వెంకటేశ్వర్లు, తిమ్మప్ప, ఎ.సుదర్శన్, బి.మణ్యం, ఏ చంద్రశేఖర్, పీ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పాలమూరు యూనివర్సిటీ ఖ్యాతిని చాటాలి

» పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప



క్రీడాకారులతో పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, అధ్యాపకులు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ ఖ్యాతిని చాటి చెప్పాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప అన్నారు. యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో మంగళవారం అంతర్ కళాశాలల మహిళలు, పురుషుల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ ఒత్తిడులకు లోనవకుండా అర్హులైన క్రీడాకారులను ఎంపిక చేయాలన్నారు. టోర్నమెంట్‌కు వెళ్లే విద్యార్థుల వెంట కోచ్ ఉండి, నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ టోర్నమెంట్ల నిర్వహణకు పియూలో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ కుమారస్వామి, ప్రొఫెసర్ సత్యభాస్కర్ రెడ్డి, పీడీ డాక్టర్ శ్రీనివాసులు, కోచ్‌లు పాల్గొన్నారు.

'పెసా' చట్టాన్ని అమలు చేయాలి

» చెంచు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లికార్జున్

మన్ననూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'పెసా' చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తేనే, ఆదివాసీల హ క్కుల సాధన సాధ్యం అవుతుందని చెంచు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లికార్జున్ అన్నారు. పెసా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం మన్ననూరులోని గిరిజన భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లమలలో పర్యాటక అభివృద్ధి, ఆలయాల్లో జరిగే ఉత్సవాలు పెసా గ్రామ సభ అనుమతితోనే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఐటీడీఏ ద్వారా నియమించిన పెసా మొబిలైజర్‌ను తొలగించాలన్నారు. గ్రామ సభలో తీర్మానం చేసి, మొబిలైజర్‌ను ఎంపిక చేసుకునే అధికారాన్ని ఆదివాసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల అభివృద్ధికి అడ్డంకిగా మారిన పునరావాస ప్యాకేజీలను తిరస్కరిస్తున్నామని స్పష్టం చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం, ఎఫ్ఆర్‌సీ, పెసా కమిటీల తీర్మానం లేకుండానే 2006లో అమ్రాబాద్ టైగర్ సాంచరీని ఏర్పాటు చేశారని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఐటీడీఏ ఏర్పాటై 10 సంవత్సరాలవుతున్నా, రెగ్యులర్ పీవోను, పూర్తి స్థాయి అధికార యంత్రాంగాన్ని నియమించలేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం తాము ఎన్ని సార్లు పాదయాత్ర చేపట్టినా, అధికారులు పలు హామీలు ఇస్తూ ఆపుతున్నారని చెప్పారు. మూడు నెలల్లో ఆదివాసీ చెంచుల సమస్యలను పరిష్కరించకుంటే, మరోసారి చలో అసెంబ్లీ పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. అంతకుముందు చెంచు నాయకులు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి డప్పుల మోత, చెంచుల నృత్యాలతో ర్యాలీగా గిరిజన భవన్‌కు చేరుకున్నారు. సమావేశంలో చెంచు వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండ్లి చిన్న అంజయ్య, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు మద్దునూరి లక్ష్మీనారాయణ, బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ వెంకటేష్, ఆదివాసీ చెంచు నాయకులు నిమ్మల లింగస్వామి, పెద్ద బయ్యన్న, అంజయ్య, ముత్తమ్మ, గురువమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.



ర్యాలీలో నినాదాలు చేస్తున్న గిరిజనులు, నాయకులు

ఆభరణాల తయారీ దుకాణంలో చోరీ



ఆభరణాల తయారీ దుకాణంలో ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

ఖిల్లాఘణపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ఓ బంగారు ఆభరణాల తయారీ దుకాణంలో సోమవారం రాత్రి దొంగలు పడి, బంగారు నగలు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. ఎస్ఐ సురేశ్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన స్వర్ణకారుడు నారాయణదాసు వెంకటేశాచారి బంగారు ఆభరణాలను తయారు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. సోమవారం పని ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం దుకాణానికి చేరుకొనే సరికి తాళం విరిగిపోయి ఉంది. దుకాణంలో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా, 14 గ్రాముల ముక్కు పుడకలు, బోగిడీలు, కమ్మలు, బంగారు గుండ్లు, 615 గ్రాముల లక్ష్మీదేవి నాణేలు, బ్రాస్‌లెట్లు, గొలుసులు, రింగులు, గిన్నెలు తదితర వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వనపర్తి జిల్లా కేంద్రం నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు దుకాణాన్ని పరిశీలించి, ఆధారాలు, వేలిముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

పీహెచ్‌సీ సందర్శన

పెబ్బేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లె శ్రీనివాసులు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని జనరల్ ఓపీ, డెలివరీ, ఇన్ పేషంట్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. అలాగే ఫార్మసీ రూమ్‌లోని మెడిసిన్, మరియు వ్యాక్సిన్ కూడా తనిఖీ చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ రాకేష్ రెడ్డి, శ్రీ హరినాథ్, రాజశేఖర్, సుప్రియ, పార్వతి పాల్గొన్నారు

నయాబ్ తహసీల్దార్‌గా నంద కిషోర్ బాధ్యతల స్వీకరణ

ఖిల్లాఘణపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దార్ కార్యాలయంలో నయాబ్ తహసీల్దార్‌గా నంద కిషోర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ నాయాబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన దుబ్బాక పరమేష్ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ బదిలీపై వెళ్లారు. నూతన నాయాబ్ తహసీల్దార్ నంద కిషోర్ మాట్లాడారు. మండలంలోని రైతులకు అందుబాటులో ఉంటూ భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వీపనగండ్ల,డిసెంబరు24,(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులోకి తరలించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దదగడ, అమ్మాయిపల్లి గ్రామాల్లో ఐకేపీ సహకార సంఘాల ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

వీపనగండ్ల, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి) : మండలంలో మూసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని పట్టపగలే చోరీలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రాణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా ఊరికి చివర ఉన్న ఇళ్ల వారు తమ అవసరాల నిమిత్తం తాళాలు వేసుకుని వెళ్లటాన్ని పసిగట్టి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామస్తులు, వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

వనపర్తి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్క వినియోగదారుడు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల హక్కుల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లాడారు. నేటి సమాజంలో జరుగుతున్న వస్తు సేవల మోసాలు, వాటి నివారణకు వినియోగదారులు కలిగి ఉన్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రామరాజు యాదవ్, దామోదర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి

ఖిల్లాఘణపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్కిమియాన్‌పల్లి పల్లె ప్రకృతి వనంలో అక్రమంగా చెట్లను తొలగించడం దారుణమని బీఆర్ఎస్ నాయకులు రాములు, శ్రీనివాసులు, సత్తిరెడ్డి, ఎంపీడీవో వెంకటాచారికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ప్రభుత్వ భూములు ఉండగా.. ప్రభుత్వ భవనాల కోసం పల్లె ప్రకృతివనాన్ని ఉద్దేశపూర్వకంగా తొలగించాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. పల్లె ప్రకృతి వనాన్ని కాపాడాలని ఎంపీడీవోను కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రమేష్

వనపర్తి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పైనే ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం బకాయిలను చెల్లించలేదన్నారు. విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. మాజీ విద్యార్థి నేత గోపాలకృష్ణ, చంద్రశేఖర్, మోహన్, అరవింద్, గణేష్, శివ, బన్నీ, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పోలీస్ వసతి గృహాలు

- ఇతర ప్రాంతాల్లో అద్దెకుంటున్న పోలీస్ సిబ్బంది
- నూతన భవనాలు నిర్మిస్తే పోలీసు విధులకు అనుకూలం



ఖిల్లాఘణపురంలో నిరుపయోగంగా మారిన పోలీస్ వసతిగృహాలు

ఖిల్లాఘణపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల కోసం నిత్యం విధుల్లో ఉంటున్న పోలీస్ సిబ్బందికి కేటాయించిన పోలీస్ వసతిగృహాలు అధ్వానంగా మారాయి. దీంతో పోలీస్ సిబ్బంది అక్కడ ఉండలేక మండల కేంద్రం, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రాల్లో అద్దెకుంటూ విధులు నిర్వహిస్తున్నారు. రూ.వేలు అద్దె చెల్లిస్తూ డ్యూటీ సమయానికి ద్విచక్ర వాహనాలపై బస్సులపై ఉరుకులు పరుగుల మీద చేరుకుంటున్నారు. పోలీస్ స్టేషన్‌లో సరైన వసతులు లేకపోవడంతో పోలీస్ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. 25 ఏళ్ల కిందట నిర్మించిన పోలీసుల వసతిగృహాలు శిథిలావస్థకు చేరడంతో నివాసానికి యోగ్యంగా లేకపోవడంతో పోలీసు కుటుంబ సభ్యులు ఆ గదుల్లో ఉండడానికి ఇష్టపడడం లేదు. రాత్రివేళ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది పాములు, విషసర్పాలతో ఇబ్బందులకు గురవుతున్నారు. శిథిలావస్థకు చేరిన పోలీస్ వసతిగృహాల గదుల పక్కన ముళ్లచెట్లు పేరుకుపోవడంతో పాములు విష కీటకాలు సంచరిస్తున్నాయి. నాలుగు సంవత్సరాల కిందట పచ్చని చెట్లతో పార్కును తలపించేలా పోలీస్ స్టేషన్‌ను నందనవనంలా, అప్పుడు విధులు నిర్వహించిన ఎస్‌ఐ వెంకటేష్ గౌడ్ ప్రత్యేక శ్రద్ధతో తయారు చేశారని పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజాప్రతినిధులు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే నూతన భవనాలను నిర్మించి సరైన వసతులు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ ఒక్కరికి ఆరోగ్యంపై అవగాహన అవసరం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా షుగర్ బీపీ, టీబీ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ హాజరై పరిశీలించారు. ప్రతీఒక్కరు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 182 మంది శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోగా 27 మందికి డయాబెటిస్ నిర్ధారణ అయినట్టు, పది మందికి బీపీ నిర్ధారణ అయినట్లు వైద్యాధికారులు తెలిపారు. టీబీ ఎక్స్‌రే 113 మందికి చేయగా మూడు అనుమానిత కేసులు నమోదైనట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడుతున్న సంచిత్ గంగ్వార్

వనపర్తి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గిరిజన భవన్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. మంగళవారం వనపర్తి మండల పరిధిలోని రాజపేట గ్రామ శివారులో నిర్మిస్తున్న గిరిజన భవన్‌ను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. గిరిజన భవన్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. గిరిజన భవన్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, మునిసి పల్ కమిషనర్ పూర్ణచందర్ ఇతర అధికారులు తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

చాపల మార్కెట్ పరిశీలన..

వనపర్తి అర్బన్ : పట్టణంలోని 15వ వార్డులో నిరుపయోగంగా ఉన్న కూరగాయల, చేపల మార్కెట్‌లను జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పరిశీలించారు. నిరుపయోగంగా ఉండడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఈ మార్కెట్లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్, వార్డు కౌన్సిలర్ బండారు కృష్ణ, యునిస్, అనిల్ కుమార్, ఉమా మహేశ్వర్ ఉన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కౌశల్ కిషోర్ పాండే

కొత్తకోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న పీఎం సురక్ష బీమా, పీఎం జీవన జ్యోతి బీమా యోజన వంటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే అన్నారు. మంగళవారం మండల మహిళా సమాఖ్య భవనంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ సంస్థలు సంయుక్తంగా వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశల్ కిషోర్ పాండే మాట్లాడారు. మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రజలు ఆన్‌లైన్, సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీవో సుదర్శన్, ఎస్‌ఐ ఆనంద్, డీపీఎం రాములు, రాజశేఖర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

వనపర్తి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో వినియోగదారులకు హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డిజిటల్ విధానం ద్వారా వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చని, అదే విధంగా వర్చువల్ హియరింగ్ ద్వారా సకాలంలో సత్వర న్యాయం పొందవచ్చని చెప్పారు. ఈ సేవల విషయంలో అందరూ అవగాహన కలిగి వినియోగం చేసుకోవాలని సూచించారు. సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్, సివిల్ సప్లయ్ డీఎం రమేష్, ఇతర అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు

వనపర్తి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఏళ్ల తరబడి ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.46.48 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

ఖిల్లాఘణపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్కిమియాన్‌పల్లిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం తహసీల్దార్ సుగుణకు వినతిపత్రం అందజేశారు. పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ నాయకులు గ్రామంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించి పట్టా చేసుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నా యకులు మన్యం రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజారెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

ఖిల్లాఘణపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిమాడలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంగళవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన కావలి అంజనేయులు ప్రమాదంలో మృతి చెందగా, అనారోగ్యం బారిన పడి బాలమ్మ, ఉప్పరి కొండన్న మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. రాళ్ల కృష్ణయ్య, కృష్ణా నాయక్, సామ్య నాయక్, లక్ష్మారెడ్డి, శేఖర్ నాయక్, నిరంజన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శరత్, ప్రతాప్, గోవర్ధన్ రెడ్డి, రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం బాధాకరం

కొత్తకోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం సాక్షిగా పాలన సాగిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అంబేడ్కర్‌ను అవమానించడం బాధాకరమని దేవరకద్ర నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది మునగారి కృష్ణ ఒక ప్రకటనలో మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు.

అనాథ బాలికకు ఆర్థిక సాయం

పెబ్బేర్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండంలోని సుగూర్‌కి చెందిన నందినికి తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా ఉండి చదువుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీంతో గ్రామానికి చెందిన యువకులు ముందుకు వచ్చి బాలికకు రూ.21 వేల ఆర్థిక సాయం మంగళవాం అందజేశారు. స్వామియాదవ్, పరమేష్, మహేందర్, శివ, మహేశ్, సుదర్శన్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కాలిన కంప్యూటర్

వీపనగండ్ల, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షార్ట్ సర్క్యూట్‌తో సీసీ కెమెరాల కంప్యూటర్ కాలి బూడిదైంది. ఈ సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ రాణి తెలిపారు. సోమవారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయంతో సీసీ కెమెరాల సిస్టం రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి కంప్యూటర్, సీపీయూ వంటి పరికరాలు కాలి బూడిదయ్యాయి. ఉదయం కళాశాలకు వచ్చిన అధ్యాపకులు పరిశీలించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పశ్చాత్తాపం స్వీకరించిన వారే యేసు వారసులు

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వనపర్తిలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పశ్చాత్తాపం చెందిన వారే యేసుప్రభు వారసులని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పాస్టర్ల ప్రార్థనల మధ్య ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. యేసు ప్రభు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని త్యాగాలు చేశారన్నారు. పాస్టర్లు జనార్దన్, కృపాకర్, యేసన్న, నిర్మల లివింగ్‌స్టన్, డాక్టర్ రాఘవులు, జోషప్, విజయ్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు

కొత్తకోట/ ఆత్మకూరు/ అమరచింత/ వనపర్తి రాజీవ్‌చౌరస్తా : క్రిస్మస్ వేడుకల కోసం జిల్లా కేంద్రంలోని ప్రధాన చర్చిలు ఒక రోజు ముందుగానే ముస్తాబు అయ్యాయి. పట్టణంలోని ఎంబీ, ఓలివ చర్చి, టౌన్ చర్చిలను ఆయా చర్చిల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. నేడు భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవడానికి ముందస్తుగా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాల వరుసలను చర్చిలపై పేర్చి మిరుమిట్లు గొలిపే వెలుతురులతో సుందరంగా అలంకరించారు. దీంతో ఒక రోజు ముందుగానే చర్చిల వద్ద క్రిస్మస్ పండుగ వాతావరణం నెలకొంది. బుధవారం క్రైస్తవులు ఆయా చర్చిల వద్దకు చేరుకొని ప్రార్థనలు నిర్వహించనున్నారు.

వీపనగండ్ల : పాస్టర్ ఎర్నియా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోనీ వీధుల్లో ఏసుప్రభుని కొలుస్తూ భక్తులు పాటలు పాడుతూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.





కొత్తకోటలో విద్యుత్ దీపాలతో ఎంబీ చర్చి, అమరచింతలో ముస్తాబైన ఎంబీ కార్మెల్ చర్చి

'ఇటుకల యూనిట్లు నెలకొల్పాలి'

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ లేదా బూడిదతో చేసిన ఇటుకల యూనిట్లను నెలకొల్పేందుకు మహిళలు, యువత ముందుకు రావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఐదు సంవత్సరాలలో దాదాపు 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించబోతోందని తెలిపారు. ఇళ్ల నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ, ప్రతీ గ్రామం, మండలం, మునిసిపాలిటీలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకు ఇటుకలు తప్పనిసరి అని పేర్కొన్నారు. సాంప్రదాయకంగా లభించే మట్టి ఇటుకలు ఖరీదు కావడం, వాటి లభ్యత కూడా తగ్గిపోవడంతో ప్రభుత్వం సిమెంట్, బూడిదతో తయారు చేసిన ఇటుకలను ఇళ్ల వాడేందుకు అనుమతించిందన్నారు. అందువల్ల స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, నిరుద్యోగ యువత ప్రతీ మండలంలో కనీసం సిమెంట్ ఇటుకలు తయారు చేసేందుకు మూడు యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న మహిళలు, యువత జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తు చేసుకున్న ప్రతీఇంటిని పరిశీలించాలి



గుంటిపల్లిలో సర్వేలో పాల్గొన్న ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీరామ్ రెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడి ఇంటిని పరిశీలించి ఇందిరమ్మ ఇంటి సర్వేను పక్కాగా నిర్వహించాలని ఆత్మకూరు ఇంచార్జీ ఎంపీడీవో శ్రీరామ్ రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇంటి సర్వేలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అనంతరం రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజా పాలనలో భాగంగా ఇల్లు లేని ప్రతీఒక్కరు దరఖాస్తులు చేసుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో అనేక గ్రామాల్లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పరిశీలించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా గుడిసెలు రేకులు ఖాళీ స్థలం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం గ్రామంలో నర్సరీ ప్లాంట్‌ను పరిశీలించి వచ్చే ఖరీఫ్ సీజన్‌కు మొక్కలను సంసిద్ధం చేసేందుకు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం మూలమల్లలో పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనెలు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు జయపాల్ రెడ్డి, లక్ష్మీ నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

భూములు ఇచ్చిన రైతుల ప్లాట్లకు ఎన్‌వోసీ ఇవ్వాలి

వనపర్తి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీకి భూములు ఇచ్చిన రైతుల ప్లాట్‌లకు ఎన్‌వోసీ ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ జబ్బార్ డిమాండ్ చేశా రు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ, ప్రభుత్వ కార్యాలయాలకు భూములు ఇచ్చిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వనపర్తి జిల్లా కేంద్రలోని మెడికల్ కాలేజీకి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు మర్రికుంట, నాగవరం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 200, 86లో 200 కుటుంబాలు పైగా వంద సంవత్సరాల నుంచి 170 ఎకరాలు భూములు సాగు చేస్తూ.. బతుకుతున్నారన్నారు. భూములను అప్పటి ప్రభుత్వం రైతులతో ఒప్పం దాలు చేసుకుని 1,081 ప్లాట్లను రైతులకు ఇచ్చిందన్నారు. అవి అమ్మడానికి కొనడానికి ఉండే విధంగా నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇస్తామని అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు ఎన్‌వోసీ ఇవ్వలేదన్నారు.

డ్రమ్ సీడర్ సాగుతో అధిక లాభాలు



డ్రమ్ సీడర్‌పై అవగాహన కల్పిస్తున్న ఏవో

కొత్తకోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేసుకుంటే రైతులకు అధిక లాభాలు వస్తాయని మండల వ్యవసాయ అధికారి జస్మిస్ అన్నారు. మంగళవారం సత్యహళ్లి గ్రామంలో డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు విత్తుకోవడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డ్రమ్ సీడర్‌తో ఎకరాకు పది కిలోలకు మించదన్నారు. అలాగే కూలీల ఖర్చులు మిగలడంతో పాటు నీటి వినియోగం తక్కువగా ఉంటుందన్నారు. పంటలకు తెగుళ్ల బెడద ఎక్కువ ఉండదన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం రైతు అర్జునయ్య పొలంలో డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు వేయించారు. ఏఈవో రవీందర్‌రెడ్డి రైతులు వెంకటేశ్వర్‌రెడ్డి, భరత్, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, రాందాస్, హనుమంతు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రవాణాకు అనుమతి ఇవ్వాలి

ఆత్మకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆంక్షలు లేకుండా చెరుకు రవాణాకు అనుమతులు ఇవ్వాలని అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరు సీఐ శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెరుకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి మాట్లాడారు. కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ అందుబాటులో ఉన్న కారణంగా ఆత్మకూరు అమరచింత మండలాల్లో అత్యధికంగా చెరుకు పంటను పండిస్తున్నారు. ఈ క్రమంలో షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును తరలిస్తున్న క్రమంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని చెరుకు ట్రాక్టర్‌ను పోలీసులు నిలిపివేస్తున్నారు. దీంతో చెరుకు ఎండిపోయి టన్నేజీ తగ్గి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు సాయంత్రం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఆంక్షలు లేకుండా చెరుకు తరలించేందుకు అవకాశం ఇవ్వాలని వారు కోరారు. వెంకటేష్, దేవస్వామి, అరుణ్ కుమార్, అంజి, మోహన్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ విలీనం వద్దంటూ దీక్ష



దీక్షలో కూర్చున్న బలిజపల్లి వాసులు

పెద్దమందడి, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బలిజపల్లి గ్రామాన్ని జంగమయ్యపల్లి గ్రామ పంచాయతీలో విలీనం చేయొద్దంటూ గ్రామస్థులు మంగళవారం దీక్ష ప్రారంభించారు. గత ప్రభుత్వంలో జంట గ్రామాలైన జంగమయ్యపల్లి గ్రామం నుంచి జలిజపల్లి గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. దీంతో ఇరు గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాలను అభివృద్ధి చేసుకున్నారు. మళ్లీ గ్రామపంచాయతీలను ఒకటిగా చేసి రెండు గ్రామాల మధ్యన ఘర్షణ వాతావరణం చోటు చేసుకునేలా చేశారని గ్రామస్థులు తెలిపారు. బలిజపల్లి గ్రామ పంచాయతీని యథావిధిగా కొనసాగించాలని బలిజపల్లి వాసులు దీక్ష ప్రారంభించారు.

'రహదారి కోసమే వరండా కూల్చివేశా'..

పెబ్బేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని మహిళా సంఘం భవనం ముందు ఉన్న వరండాను రహదారి కోసం కూల్చివేశానని మునిసిపల్ రెండో వార్డు కౌన్సిలర్ అక్కమ్మ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులకు కొంతమంది మహిళా సంఘం నాయకులతో నన్ను అరెస్టు చేయాలని చూస్తున్నారని, అది సాధ్యపడదన్నారు. బాట కోసం వరండాను ఎమ్మెల్యే సూచన మేరకు తీసివేయాలని చెప్పడంతో తొలగించానని, నేను చేసింది ప్రజల కోసమన్నారు. బీఆర్ఎస్ నాయకుల్లా అర్ధరాత్రి పార్కును కూల్చలేదన్నారు. ఎవరు అవినీతికి పాల్పడ్డారో, ఎవరు తప్పు చేశారో పెబ్బేరు చౌరస్తాలో తేల్చుకుందామన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జూరాల నీటిని విడుదల చేయాలని ఆందోళన



జూరాల ఎస్‌ఈ కి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యాసంగి పంటకు సాగునీరు ఇవ్వాలని మండల టౌన్ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జూరాల ప్రాజెక్టు ఎస్ఈ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ ఎం. కర్రే స్వామి మాట్లాడారు. నీళ్లు నిధులు నియామకాలు అనే ఉద్యమంతో తెలంగాణ సాధించుకున్నామని కాంగ్రెస్ అధికారంలో వచ్చాక, నీళ్ల కోసం కన్నీళ్లు పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా.. ప్రభుత్వం నీరు విడుదల చేయడం లేదన్నారు. అనంతరం జూరాల ఎస్ ఈ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు యాదవ్, దిలీప్ రెడ్డి, ఎం జగన్నాథ నాయుడు, పెద్దింటి వెంకటేష్, ఎం. రాజశేఖర్, కౌన్సిలర్లు సుమతి, పార్వతి, ఎల్లారెడ్డి, గోపి బాబు, విశ్వరూపం, వడ్డె రమేష్, నరేష్, మన్యం యాదగిరి, శ్రీను, బాలస్వామి, ఆనంద్, వీరస్వామి, రామచంద్రారెడ్డి, శివరాజు, గోవిందు, శేఖర్ అచారు, గణేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.